విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

పట్టణంలో పోలీసుల కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశానుసారం తాడేపల్లిగూడెం డీఎస్పీ డిఎస్ ఆర్‌విఎస్ఎన్ మూర్తి ఆధ్వ ర్యంలో ఆదివారం ఉదయం ఐదు గంటలకు తాడేపల్లిగూడెం పట్టణంలోని యాగర్లపల్లి, జువ్వలపాలం శివాలయం వీధిలో రాబోవు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్టిలో ఉంచుకొని కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి ధృవపత్రాలు లేని నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనపరచుకున్నారు. ఈ ఆపరేషన్‌లో తాడేపల్లిగూడెం టౌన్ సిఐ ఏ సుబ్రహ్మణ్యం, టౌన్ ఎస్ఐ జేవీఎన్ ప్రసాద్, కె సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ ఏ సుబ్రహ్మణ్యం, తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది నాగాలాండ్ పోలీస్ సిబ్బంది కలిసి 80 మంది వరకు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: లయన్స్ క్లబ్ తాడేపల్లిగూడెం సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కడకట్లలో జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో అధ్యక్షులు వంగపండు రామోహనరావు అధ్వర్యంలో కంటి వైద్య శిభిరం నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పదం కుమార్ గుప్తా (డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్) ఆర్థిక సహకారం చేసారు. 86 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తం 10 మందిని నిడదవోలుకు పంపారు. 15 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని ముఖ్య అతిథిగా డాక్టర్ రవి కుమార్ ప్రారంబించారు. ఆయన మాట్లాడుతూ తాను కూడా లయన్స్ క్లబ్ మెంబర్ అవడం చాలా అదృష్టంగా భావిస్తున్నాని, తన వంతుగా సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుంటానని అన్నారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అబినందనీయమని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్య అతిథిగా మదన్ మోహన్ అగర్వాల్ (రీజియన్ చైర్ పర్సన్) పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో కార్యదర్శి చిన్నం జగదీష్, ఎల్ ఎస్ వి నాగేశ్వరరావు, బాపయ్య శర్మ పేరూరి కాశయ్య, వి. వి. ఎస్. లక్ష్మీనారాయణ, భీమవరపు మహాలక్ష్మి, పచ్చ వెంకటేశ్వరరావు, డి.వి.పి. విశ్వేశ్వర రావు, సి.హెచ్. వెంకటేశ్వరరావు, సూరిబోయిన ఆంజనేయులు, ఆంజనేయ స్వామి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రంథాలయాలలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. శిక్షణ తరగతులను ఉపయోగించుకోవాలని ధర్మాజీ గూడెం లింగపాలెం గ్రంథాలయ అధికారులు లతీఫ్, వెంకటరమణ కోరారు.

సైదు గంగరాజు వర్ధంతి

విశాలాంధ్ర - కైకలూరు : కొల్లేరు నాయకులు కీర్తిశేషులు సైదు గంగ రాజు 18వ వర్ధంతి నిర్వహించారు. శృంగవరపాడులో వున్న గంగరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొల్లేరు ప్రజలు కోసం గంగరాజు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొల్లేరు నాయకులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వడ్డీ సాధికారిక కన్వీనర్ భలే యేసు రాజు, జయ మంగళ సుబ్బరాజు, శృంగవరపాడు కన్వీనర్లు బలే బాస్, బలే కొండలు, ఘంటసాల రామారావు, నేపాల్ పోతురాజు, సైదు జయరాజు, జయ మంగళ దుర్గాప్రసాద్, భలే పెద్ద వడ్డీ నరసింహులు, ఘంటసాల నాగేశ్వరరావు సైదు సహదేవ్ రాజు సైదు గాంధీ, సైదు డేవిడ్ రాజు, సైదు మౌళి, భలే రాము, నేపాల్ శివకృష్ణ, సీతయ్య, కన్నయ్య గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-టి నరసాపురం: మండ లంలోని మర్రిగూడెం గ్రామంలో రూ.కోటి 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న బిఎస్ఎ న్ఎల్ సెల్ టవర్ నిర్మాణానికి అధికారులు ఆదివారం శంఖుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కురసం నిరిక్షనరావు మాట్లాడుతూ ఏలూరు పార్లమెంటు సభ్యులు కోటగిరి శ్రీధర్, పోలవరం శాసన సభ్యులు తెల్లం బాలరాజుల సహకారంతో సెల్ టవర్ మంజూరయ్యిందన్నారు. గిరిజన ప్రాంత ప్రజల చిరకాల కోరిక సెల్ టవర్ నిర్మాణం అన్నారు. టవర్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోయం బిందు, వైసిపి ఎస్.టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురసం నిరీక్షణరావు, వైసిపి ఎస్.టి సెల్ మండల అధ్య క్షులు కురసం రవీంద్రబాబు, యూత్ నాయకులు పూసం సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కుల మతాలకతీతంగా ఆర్యవైశ్యుల సేవలు

విశాలాంధ్ర-పాలకోడేరు: ఆర్య వైశ్యులు కుల మతాలకు అతీతంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని శృంగవృక్షం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాశీ జగన్నాథం అన్నారు. శ్రీవాసవి మాత జయంతి సందర్భంగా ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పదవ తరగతి లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆర్య వైశ్య సంఘం చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శృంగవృక్షం హై స్కూల్ లో చదివి మండలం లోనే ప్రథమ స్థానం సాధించిన ముగ్గళ్ళ జస్వంత్ కు, ద్వితీయ స్థానం సాధించిన లోకేష్ కు, తృతీయ స్థానం సాధించిన రాజశేఖర్ కు, కృష్ణమూర్తికి, కూర్మాల సంతోష్ కు, ఇంటర్ లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన సుదీప్తి కు సత్కారం చేశారు. అంతకుముందు వాసవీ మాతకు అభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, అత్యం వాసు, పూర్ణారావు,యానాది శెట్టి, కూర్మాల కాశీ, కుసుమ గుప్త, కూర్మాల నరసింహారావు, శ్రీనివాసరావు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.కందుల అరుణసంధ్య, కూర్మాల మురళి, నాగరాజు, గ్రంధి రాజా లు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.కందుల చరణ్ దీప్, సహస్ర, లు పెన్నులు అందజేశారు.

అటకెక్కిన వేసవి శిక్షణ..

ప్రతిపాదనలు పంపినా స్పందించని ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఈ ఏడాది వేసవి క్రీడా శిక్షణా తరగతులు లేనట్లేనని క్రీడా శాఖ ఉన్నతాధికారులు తేల్చేశారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి విద్యార్థులకు క్రీడా శిక్షణా తరగతులు నిర్వహించాలనుకుంటే శాప్ తరఫున సహకారం అందించాలని నిర్ణయించారు. ఈనెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు ఏటా వేసవి సెలవుల్లో విద్యార్థులకు క్రీడలపై శిక్షణ ఇచ్చేవారు. ఈనెల 1వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహించాల్సిన శిక్షణ శిబిరాలు ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ వరకు వాయిదా వేశారు. గడువు దాటినా శిబిరాల నిర్వహణకు శాప్ నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాకపోవడం కనీసం స్పందించకపోవడంతో జిల్లాలోని అధికారులు శిక్షకులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సాధారణంగా శిక్షణా శిబిరం నెల రోజులపాటు నిర్వహించాల్సి ఉంది. మార్గదర్శకాలు వెలువడి, క్రీడా సామాగ్రి వచ్చేసరికి పాఠశాలలు తన ప్రారంభమైపోతాయని సీనియర్ క్రీడాకారులు చెబుతున్నారు. జిల్లాలో గత వేసవి క్రీడా శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. వీటికోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటిలో ఆట పరికరాలు కొనుగోలుతో పాటు, శిక్షకులకు పారితోషకం అందజేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ తరగతులలో బాల్ బ్యాట్మింటన్, బాక్సింగ్, ఫుట్బాల్, హాకీ, ఖో-ఖో , కబడి, స్కేటింగ్, వాలీబాల్, యోగాలో శిక్షణ ఇచ్చారు. నెల రోజులపాటు విద్యార్థులకు అందించే ఈ క్రీడా శిక్షణ వారికి ఎంతో దోహదపడేది.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తేనే....

ఈ ఏడాది ఎన్నికల కోడ్ సాకుగా చూపుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా తరగతులు ఏర్పాటు చేయలేదు. కొంతమంది స్వచ్ఛంద సంస్థలు, దాతలు, ముందుకు వచ్చిన చోటే ఏర్పాటు చేస్తున్నారు. కానీ ప్రభుత్వ పరంగా క్రీడా శిక్షణా తరగతులు నిర్వహించడంపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జిల్లాలో ఏర్పాటు చేసే క్రీడా శిక్షణా తరగతులకు సంబంధించి గత ఏడాది లాగానే ఈ ఏడాది ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించినా నేటి వరకు దీనిపై స్పష్టత లేకపోవడంతో ఈ ఏడాది వేసవి క్రీడా శిక్షణా తరగతులు లేనట్లేనని తేలిపోయింది.

క్రీడలపై నిర్లక్ష్యం...

వేసవి సెలవులు వృధా పోకుండా క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు వారికి నచ్చే క్రీడలలో సాధన పొందేందుకు ఈ శిక్షణా తరగతులు ఎంతో ఉపయోగపడేవి. ఈ ఏడాది వీటి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంపై విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రాలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలను గుర్తించి వీటిలో ఉపాధి హామీ పథకం కింద కూలీలతో మట్టి పూడిక, తుప్పలు తొలగించే పనులు చేపట్టారు. జిల్లాలోని ప్రధాన పట్టణ ప్రాంతాలలోని క్రీడా మైదానాలను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. క్రీడా మైదానంలో వర్షం వస్తే నీరు నిండిపోతుంది. నీరు పోయే మార్గం లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అయితే దీనిపై క్రీడా అధికారులను సంప్రదించగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించడానికి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు. పాఠశాలల్లో శిబిరాలు నిర్వహించేందుకు ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. నేటికీ మంజూరు కాలేదన్నారు. అనుమతులు రాగానే వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని క్రీడాధికారులు తెలిపారు.

ఉద్యమ నిర్మాత, ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య

విశాలాంధ్ర-ఏలూరు: విగ్రహాలు కాదు గ్రంథాలయాలు నెలకొల్పండి అని చెప్పిన దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ ఏలూరు, గాంధీ నగర్ సుందరయ్య గ్రంథాలయంలో కంది విశ్వనాథం అధ్యక్షతన జరిగింది. వర్ధంతి సభకు ముఖ్య వక్తలుగా విచ్చేసిన బుద్ధ సోమయ్య, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని, తన జీవితం ప్రజాసేవకే అంకితం అని పిల్లల్ని సైతం కనకుండా కార్మిక, కర్షక, కష్టజీవుల కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. ప్రతి మనిషికి విద్య, వైద్యం ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని చట్టసభలలో కష్ట జీవుల పక్షాన నిలబడి ప్రభుత్వాలను నిలదీసే వారని అన్నారు. నేడు చట్టసభలలో వ్యక్తిగత దూషణలకు పదవులు, ఆస్తులు సంపాదించుకోవడం కోసం వ్యాపార వస్తువుగా రాజకీయాన్ని మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు ఉన్నంతకాలం ప్రజా సమస్యలపైనే చర్చ నడిచేదని, కమ్యూనిస్టులను చట్టసభలకు పంపాల్సిన బాధ్యత కార్మిక వర్గం పై ఉన్నదని విజ్ఞప్తి చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఆయన స్ఫూర్తితో గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వర్ధంతి సభ అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించారు. జే గోపి, మంచెల్ల ఇస్సాకు సభా కార్యక్రమానికి నాయకత్వం వహించగా సిపిఎం పార్టీ నగర్ కార్యదర్శి పి కిషోర్, సిహెచ్ అమర్ కుమార్, సిహెచ్ సుందరయ్య, ఇందిరా, లెనిన్, ఠాగూర్ రాజా తదితర ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు.

నాలుగు నెలలకే... గోతులు పడి..!

విశాలాంధ్ర - పెనుమంట్ర: బ్రాహ్మణ చెర్వు చెన్నాడ చెర్వు మధ్య రహదారి గోతులు పడి అధ్వానంగా మారింది. కాలువకు చేర్చి ఉన్న ఈ మార్గం పలు చోట్ల దిగుబడి గుంతలు ఏర్పడ్డాయి. గతంలో ఈ రోడ్డు అభివృద్ధి చేసినా... నాణ్యతాలోపం కారణంగా నాలుగు నెలల వ్యవధిలోనే ధ్వంసంమైంది. తాత్కాలిక మరమ్మతులు చేసిన ప్రయోజనం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో రాత్రి వేళల్లో స్థానికులు బిక్కు బిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన రహదారి పై భారీ వాహనాలు వెలుతూ ఉంటాయని తెలిసి కూడా రహదారి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత పాటించలేదని, రహదారిపై గోతులు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బి ఏ ఈ యశ్వంత్ మాట్లాడుతూ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొనసాగుతున్న స్వామి కల్యాణోత్సవాలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గవరవరంలో కొలువైన శ్రీ రమా సమేత వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దేవేరితో సహా స్వామి వారిని వధూ,వరుల అలంకరణతో పూజలను గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహ, శాంతి హెూమాలు నిర్వహించారు. సాయంత్రం నుండి గ్రామోత్సవం,రాత్రికి కళ్యాణ కార్యక్రమంలో భాగంగా సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. 18 వ తేదీన ప్రారంభమైన కల్యాణ ఉత్సవ కార్యక్రమాలు 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. చివరి రోజున మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన నిర్వహించనున్నారు. అర్చకులు వాడపల్లి ప్రభాకర రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 1932లో స్వామివారి ఆలయ నిర్మాణం రూపు దాల్చింది.

పట్టణ కవి వీఎస్వీ ప్రసాద్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-తణుకు: ఐఎస్ఓ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో సంస్థ అంతర్జాతీయ అధ్యక్షులు డా॥కత్తిమండ ప్రతాప్ సారధ్యంలో ఇటీవల హైదరాబాద్ కాచిగూడలోని కర్ణాటక సాహిత్య మందిరం మెయిన్ హాల్ నందు నిర్వహించిన తెలుగు- కన్నడ ద్విబాషా కవి సమ్మేళనంలో తెలుగు భాషా విభాగంలో తణుకు పట్టణ కవి వి ఎస్ వి ప్రసాద్ పాల్గొని శ్రీ శ్రీ కవితా వైభవం అనే కవితను చదివి వినిపించారు. ఈ కవితకు సబా సదుల నుండి ప్రశంసలు పొందారు. అనంతరం ప్రముఖ కన్నడ- తెలుగు రచయిత్రి జోష్యుల ప్రభాశాస్త్రి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ మహిళా విభాగ అధ్యక్షురాలు చిట్టి లలిత, జాతీయ కల్చరల్ వింగ్ డైరెక్టర్ దేబా విజయ్ కుమార్, తిరుపతి విభాగం కోశాధికారి ధనాసి ఉషారాణి, కన్నడ కవి పీవీ ప్రదీప్ కుమార్, సత్య సాయి జిల్లా కార్యదర్శి వడ్డే సుధాకర్ తదితరులు ప్రసాద్‌కు శాలువా, ప్రశంసా పత్రం జ్ఞాపిక పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆయన నివాసంలో తణుకు పట్టణ ప్రముఖులు తదితరులు కలిసి అభినందించారు. వారు మాట్లాడుతూ 401 సన్మానాలను పొందిన ఏకైక వ్యక్తి తణుకు పట్టణ కవి కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో సన్మానాలు అందుకోవాలని పట్టణ ప్రముఖులు ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యుత్ సరఫరా నిలిపి వేతకు వినియోగదారులు సహక రించాలని జంగారెడ్డిగూడెం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. రాజుపోతేపల్లి 33/11కె వి సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త గూడెం 11కె వి ఫీడర్ ఆర్ డి ఎస్ ఎస్ పనులు ఈ నెల 20,21 తేదీలలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పనులు జరుగుచున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

కౌంటింగ్‌కు కట్టుదిట్ట ఏర్పాట్లు చేయాలి

విశాలాంధ్ర-భీమవరం: సాధారణ ఎన్నికలలో భాగంగా కౌంటింగ్ ప్రక్రియ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని, ఇందులో ఎటువంటి లోటుపాట్లకు తావీయరాదని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ కోసం అన్ని విధాల సన్నద్ధంగా ఉండాలని, ఇందుకోసం ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో బ్యారికేడింగ్ పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో బందోబస్తుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని, వెంటనే ట్రాఫిక్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద రెయిన్ ప్రూఫ్ టెంట్స్ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేసుకొని కౌంటింగ్ కోసం సర్వం సిద్ధంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు, ఓట్లు లెక్కింపు సజావుగా పూర్తికి సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత పరిశీలన

విశాలాంధ్ర-ఏలూరు: పోలవరం నియోజకవర్గ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను ఐటిడిఏ పీఓ, పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సూర్యతేజ ఆదివారం పరిశీలించారు. ఏలూరు లోని సర్. సి.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ ఈవీఎం ల భద్రత అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడంచెలు గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తులను పిఓ పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూంలు ఉన్న ప్రాంతంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరాదన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. మానవతా వార్షిక సమావేశం సందర్భంగా కర్ర సాము శిక్షణ శిబిరం ఫ్లెక్సీల ప్రచార కరపత్రాలను నాగేశ్వరరావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ర స్వాము మాస్టర్స్ జోగా చంద్రశేఖర్, జోగా మోహనరావు, లు శిక్షణ ఇస్తారని తెలిపారు. సోమవారం సాయంత్రం గం.5 లకు హైస్కూలు నందు వివిధ సంఘాల పెద్దలు పాల్గొని కర్ర సాము శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఆసక్తి కలవారు నేర్చుకోవడానికి ఏర్పాటుచేసిన ఉచిత శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కే శ్రీనివాసరావు ఫోన్ నంబర్ 9346936521 నువ్వు సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, మానవతా ఏలూరు కమిటీల సభ్యులు అడుసుమిల్లి నిర్మల పిడి రత్నాకర్ రావు, దేవినేని భాస్కరరావు, ఎస్ కస్తూరి రావు, శ్రీహరికోటి, మేతరజబాబు, కే కనకదుర్గ, ఏ మోహిని, సోమ్లా నాయక్, నాగేశ్వరరావు, సత్యవాణి, కోహిమా తది తరులు పాల్గొన్నారు.

చినవెంకన్న ధ్వజారోహణం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి వైశాఖమాస తిరుకళ్యాణమహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో బాగంగా ఆదివారం ఉదయం నిత్యార్చన, గణపతిపూజ, బలిహరణ, ధ్వజారోహణ కార్యక్రమం, సాయంకాలం హంసవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారి గర్భాలయం ముందున్న ధ్వజస్థంబం వద్ద ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు.

పాలకుల అణచివేతను సంఘటితంగా ఎదుర్కొంటాం: సూర్యనారాయణ

విశాలాంధ్ర-భీమవరం: గత కొన్నేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్లు ఆత్మ గౌరవం కోల్పోయి బతుకుతున్నామని, హక్కులు అడుగుతుంటే కేసులు పెడ్తున్నారని, పాలకుల అణచివేతను సంఘటిత పోరాటాలతో ఎదుర్కొంటామని ఎ.పి.ప్రభుత్వ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల సంఘాల జెఏసి చైర్మన్ కె.ఆర్.సూర్యనారాయణ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్వర్యంలో ఆదివారం భీమవరంలో జరిగిన చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఉద్యోగ వర్గాల్లో ఆత్మస్థైర్యం నింపడానికి రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. 12వ పిఆర్సీ వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన పాతిక వేల కోట్ల రూపాయల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీచర్లు ప్రమోషన్ లేకుండానే పదవీ విరమణ చేస్తున్నారని, ఉపాధ్యాయులతో మరుగుదొడ్లు కడిగించిన ఘనత ప్రస్తుత సర్కారుదేనని, ఇదిలా ఉంటే విద్యాశాఖ ప్రిన్సిపుల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులకు నరకం చూపిస్తున్నాడని ఆయన విమర్శించారు. గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇంకా విధివిధానాలు లేకపోవడం శోచనీయమన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యిందన్నారు. కాని వారి పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా అయ్యిందని ధ్వజమెత్తారు. 371డి రాష్ట్రపతి ఉత్తర్వులు సక్రమంగా అమలు కావడంలేదని, ఐదొందల జిపిఎఫ్ నిధులు దొంగిలించిన ఘనత మన సర్కారుదేనని, ఉద్యోగుల బకాయిలు ఎన్నివేల కోట్లు పేరుకుపోయాయో స.హ.చట్టం ద్వారా తెలుసుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ ఇవ్వమంటే జిపిఎస్ అంటూ దొంకతిరుగుడు ఉత్తర్వులిచ్చారని, సిపిఎస్ వాటాను జమచేయకుండా ప్రభుత్వం వాడేసుకుంటుందని ఆయన ఆరోపించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ అందించిన ఎలక్షన్ కమిషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చట్టబద్ధ హక్కుల సాధనలో 30 సంఘాలు ఏకతాటిపైకి వచ్చాయని న్యాయబద్ధంగా తమకు వచ్చే వాటిని ఒదిలే ప్రసక్తిలేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెఏసి కో చైర్మన్ కరణం హరికృష్ణ, స్టేట్ జనరల్ సెక్రటరీ బాజీ పఠాన్, జిల్లా చైర్మన్ జి ఆర్ ఎస్ ఎన్ రాజుజిల్లా కార్యదర్శి చంద్రమౌళి, విఆర్ఓ సంఘం రాష్ట్ర కార్యదర్శి, భూపతిరాజు రవీంద్ర, జిల్లా జెఏసి ఆఫీస్ బేరర్సు, సభ్యులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత: జేసీ

విశాలాంధ్ర-ఏలూరు: ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టమైన భద్రత పాటించే చర్యలు తీసుకున్నామని దెందులూరు నియోజకవర్గ ఆర్ వో ,జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. వట్లూరు లోని సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. దెందులూరు శాసన నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఉన్న భద్రతా పరిస్థితులను గమనించారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిష్టర్ లో ఆమె సంతకం చేశారు. మూడంచెలు గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తులను జేసీ పరిశీలించారు. దెందులూరు తహసీల్దార్ వరహాలయ్య, అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: ఈవీఎం బాక్సులు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్.పి. డి.మేరీ ప్రశాంతి పేర్కొన్నారు. సార్వత్రికల ఎన్నికల అనంతరం ఈవీఎం,ఈవీఎం ప్యాడ్‌లను ఏలూరు సిఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎం బాక్స్‌లు ఏలూరు జిల్లాలో ఉన్న ఎం. పి, అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎం బాక్స్ లు భద్రపరిచి మూడు అంచెల భద్రత కల్పించిన నేపథ్యంలో ఆదివారం ఏలూరు జిల్లా ఎస్.పి. డి.మేరీ ప్రశాంతి, ఈవీఎం స్ట్రాంగ్ రూములో వద్ద భద్రత ను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతను నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ నిర్వహణలో అలసత్వం వహించకుండా అప్రమత్తతో ఉండాలని, స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పనితీరుల గురించి అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఆదేశాలు ఇచ్చారు. ఏ.ఆర్ అదనపు ఎస్.పి. ఎన్.ఎస్.ఎస్ శేఖర్, ఏ .ఆర్ డి.ఎస్.పి. శ్రీహరిరావు, ఎస్.బి సి.ఐ.మల్లేశ్వరరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం ప్రారంభమైంది. మంచి నీతి కథలు, దేశభక్తి కథలు, ఫ్రీడమ్ ఫైటర్స్ జీవిత చరిత్రలతో ప్రారంభించారు. అనంతరం మ్యూజిక్ టీచర్,(రిసోర్సెస్ పర్సన్) వి.నళిని విద్యార్థులకు దేశ భక్తీ గీతాలపై సారే జహా సే అచ్చా గీతం పై శిక్షణ ఇస్తూ విద్యార్థులకు నేర్పిస్తూ వ్రాసుకోమని పూర్తి జాతీయ గీతంను నేర్పించారు. రెండో ఊరు సోర్స్ పర్సన్ డి. శ్రీవల్లి "వెస్ట్ ఫ్రమ్ ది బెస్ట్" అని ప్లాస్టిక్ బాటిల్స్ తో డెకరేట్ ఐటమ్స్ తయారు చేయుటపై శిక్షణ కొనసాగించారు. అనంతరం హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బి. దుర్గా ప్రసాద్ టీమ్ విద్యార్థులందరికీ మైండ్ పవర్ గేమ్స్, మెమరీ గేమ్స్ నేర్పించారు. ఈ శిక్షణా కార్యక్రమాలను డిప్యూటీ లైబ్రరీ ఎన్ ఎ. నారాయణ రావు పర్యవేక్షించారు. వి.టి.సందీప్ కుమార్, ఎండీ. ఎ. అస్లామ్ పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నవధాన్యాలు పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఖరీఫ్ సీజన్లో భూముల సారవంతానికి రైతులకు నవధాన్యాలను అందజేస్తున్నట్లు ఏడీఏ పీ బుజ్జిబాబు పేర్కొన్నారు. కొయ్యలగూడెం ఏఎంసీ యార్డు ప్రాంగణంలో అందించేందుకు పద్దెనిమిది రకాల కలిగిన నవధాన్యాల బ్యాగులను సిద్ధం చేశామన్నారు. పిఎండిఎస్ పథకం ద్వారా ప్రకృతి వ్యవసాయ శాఖ డిపిఎం తాతారావు ఆధ్వర్యంలో కేఆర్ పురం పరిధిలోని రైతులకు వీటిని ఖరీదుకు అందజేయడం జరుగుతుందన్నారు. పదికేజీల బ్యాగ్ ఎనిమిది వందల రూపాయలకు అందిస్తున్నామని, తమ పరిధిలోని రైతులందరికి ఇది వర్తిస్తుందని తెలిపారు. గతంలో పచ్చిరొట్ట భూసార అభివృద్ధికి దోహదపడేది అని అయితే నలభై ఐదు రోజుల వయసు ఉన్న నవధాన్యాలపంటను అదును చూసి దున్నుకోవడం వల్ల రైతులకు ఐదు టన్నుల పచ్చిరొట్ట భూసారంతో సమానం అవుతుంది అన్నారు. పప్పు జాతి, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, ఆయిల్ సీడ్స్ తదితర రకాలను నవధాన్యాలలో మిశ్రమమై ఉంటాయన్నారు. కావలసిన రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించవచ్చని సూచించారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలిసుల వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కోన సాయి (23)అతని స్నేహితుడు రాజ్ కుమార్ (17)ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డుపై వస్తుండగా స్థానిక ఆర్టీవో కార్యాలయం వద్ద గుర్తు తెలియని వాహనం వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో కోన సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు రాజ్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకు వెళ్లగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు గ్రామానికి చెందిన డిఎఫ్ఓ వి.ప్రభా కర్ ఇంటర్మీడియట్ పిల్లల కొరకు జేఈఈ అడ్వాన్స్ అండ్ మెయిన్స్ పుస్తకాలు గ్రంథాలయానికి ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి వెళ్లి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పోటీ పరీక్షకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. భీమేశ్వరరావు, గ్రంధాలయ పాలకులు గంగాధర్ పాల్గొన్నారు.

పుష్పప్రియ కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర-భీమవరం: ఇటీవల నాచు వారి సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొని దుండి పుష్పప్రియ (12) కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆదివారం పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆడుతూ పాడుతూ చదువుల్లో ముందుడే చిన్నారిని మృత్యువు కంబళించడం దురదృష్టమని ఆవేదన వ్యక్తంచేశారు. బాదిత కుటుంబానికి అండగా ఉంటామని బాలిక తండ్రి జయరావుకి ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి సత్తిబాబు, కొప్పినీటి శ్రీను, మీసాల రాజు, నల్లం చిట్టిబాబు, పులపర్తి సల్మాన్ రాజు పాల్గొన్నారు.